సాక్షి
నంద్యాల
శనివారం । 16 । మార్చి । 2024



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



సంప్రదాయ నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళావేదికపై ధర్మవరానికి చెందిన లలితా నాట్య కళానికేతన్ బృందం నృత్యప్రదర్శన అలరించింది.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

అహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకుర్పారణ చేశారు. ఎగువ అహోబిలంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 5:01
ఆదోని	సా॥ 6:35	ఉ॥ 5:04
నంద్యాల	సా॥ 6:32	ఉ॥ 4:58
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:59
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:59

హదీస్ వెలుగు :

'రంజాన్ ఉపావాస దీక్ష మనిషిలోని అహంను తొలగించి, ఆధ్యాత్మికత, మంచి నడవడికను నేర్పుతుంది. వీటిని తప్పనిసరిగా పాటించి అల్లాహ్ అనుగ్రహం పొందండి' – పవిత్ర ఖురాన్

ఊరూరా అదిగో అభివృద్ధి

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి. ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాలతో పరిపాలన పల్లెకు చేరింది. గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజల ముగింటకే సేవలు చేరాయి. దశాబ్దాలుగా ప్రతి చిన్న పనికి వ్యయప్రయాసలతో మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల చుట్టూ తిరిగిన ప్రజలు ప్రస్తుతం స్వగ్రామం లోనే సేవలు పొందుతూ 'అభివృద్ధి అంటే ఇదే కదా' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సాదరదిన్నెలో గ్రామ సచివాలయం, రైతు భరోసాకేంద్రం

- జగనన్న పాలనలో అభివృద్ధి వికాసం
- ప్రజల చెంతకు ప్రభుత్వ కార్యాలయాలు
- సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోనే సమస్యల పరిష్కారం
- అన్నదాతకు అభయమిస్తున్న రైతు భరోసా కేంద్రాలు
- వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లతో అందుబాటులో మెరుగైన వైద్యం
- ఐదేళ్లలో సరికొత్త పాలన తెచ్చిన సీఎం వైఎస్ జగన్

కోవెలకుంట్ల: జాతిపిత మహాత్మగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. గ్రామస్థాయిలో పరిపాలనను వికేంద్రీకరించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఊరూరా శాశ్వత ప్రభుత్వ భవనాలు నిర్మించి ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చారు. అధికారం చేపట్టిన ఏడాదిలోపే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చి ప్రభుత్వ పాలనను కొత్త పుంతలు తొక్కించారు. ప్రతి రెండువేల మంది జనాభాకు ఒక గ్రామ/వార్డు సచివాలయం ఏర్పాటు చేసి సంక్షేమ ఫలాలను నేరుగా గడప వద్దకే చేర్చారు. అన్నదాతల అవస్థలకు చెక్‌పెడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పేద ప్రజలకు వారున్న గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలందించాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు నిర్మించి ప్రాథమిక వైద్యానికి జీవం పోశారు. ఒక్కో గ్రామ/వార్డు సచివాలయ నిర్మాణానికి రూ. 40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ. 21.80 లక్షలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ. 20.20 లక్షలు కేటాయించింది. నంద్యాల జిల్లాలోని 415 గ్రామ/వార్డు సచివాలయాలు, 394 రైతు భరోసా కేంద్రాలు, 248 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేశారు.



వెలగటూరులో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్

అన్ని హంగులతో ప్రభుత్వ భవనాలు

గతంలో పాలకులు ఎవరూ ప్రభుత్వ భవనాలు గురించి ఆలోచన కూడా చేయలేదు. ఉన్న ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరి అధ్వాన్నంగా మారినా పట్టించుకునేవారు కాదు. టీడీపీ హయాంలో ప్రభుత్వ భవనాల పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. ప్రభుత్వ భవనాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులు ఎన్నుసార్లు మొరపెట్టుకున్నా గత చంద్రబాబు సర్కార్ పట్టించుకోలేదు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సామాజిక ఆరోగ్యకేంద్రాలు కూలిపోయే దశకు చేరకున్నా మరమ్మతులు చేయలేదు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఏఎస్ఎంలకు కుర్చీలు కూడా ఉండేవికాదు. ఈ దశలోనే సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన స్వరూపాన్నే మార్చివేశారు. ప్రజా సమస్యలకు వారి చెంతలోనే పరిష్కారం లభించేలా చర్యలు తీసుకున్నారు. నాడు– నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మార్చేశారు.

జిల్లాలో ప్రభుత్వ భవనాల నిర్మాణం వివరాలు

భవనం	మంజూరు	పూర్తి	నిర్మాణదశ
గ్రామ/వార్డు సచివాలయాలు	415	292	123
రైతు భరోసా కేంద్రాలు	394	222	172
వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు	248	116	132

సమస్యలకు చెక్

ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా గతంలో మండల కేంద్రంలో ఉన్న తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. గ్రామ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో సర్టిఫికెట్ల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు 542 రకాల సేవలు అందుతున్నాయి. జిల్లాలో 415 గ్రామ సచివాలయా ద్వారా ప్రజలకు సేవలందుతున్నాయి. నకిలీ విత్తనాలు, కల్తీ మందుల బారి నుంచి రైతులను కాపాడేందుకు గ్రామ సచివాలయానికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జగనన్న ప్రభుత్వం ఆ సమస్యలకు చెక్ పెడుతూ అందుబాటులోకి తెచ్చిన ఆర్‌బీకేలు అన్నదాతకు అండగా నిలిచాయి. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 394 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వివిధ సేవలందుతున్నాయి. ఒకప్పుడు చిన్న రోగమొచ్చిన వైద్యం కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అభివృద్ధి చెందాయి. కొత్తగా విజిల్‌క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. నంద్యాల జిల్లాలో 248 వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు మంజూరు చేసింది. ఆయా క్లినిక్‌ల్లో ప్రజలకు వైద్యసేవలందుతున్నాయి. బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక రోగాలతో పాటు సాధారణ జ్వరం, దగ్గు, జలుబు, తదితర రోగాలకు ఉచితంగా మందులు ఇస్తున్నారు.

గ్రామాల్లో భవనాలు కళకళలాడుతున్నాయి



ఒకప్పుడు ఏ పనికావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. గతంలో ఎవరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అంటూ గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు వెలిశాయి. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం విలేజ్ హెల్త్‌క్లినిక్‌లతో ప్రభుత్వ భవనాలు కళకళలాడుతున్నాయి. అన్ని రకాల సేవలు ఈ కార్యాలయాల్లో సులభంగా అందుతున్నాయి.

– దినకర్, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

విత్తన, ఎరువుల కష్టాలు తీరిపోయాయి



గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు కావడంతో విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసేందుకు కష్టాలు తీరిపోయాయి. గతంలో వీటిని పొందేందుకు ఎన్నో అవస్థలు పడ్డాం. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సూచనలు, సలహాలు అందిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో పలు సమస్యలు తొలగిపోయాయి.

– సుధాకర్, రైతు, కోవెలకుంట్ల

ఊరిలోనే వైద్యసేవలు



రాష్ట్ర ప్రభుత్వం నాడు– నేడు కార్యక్రమం ద్వారా ఆసుపత్రులను తీర్చిదిద్దింది. గతంలో చిన్న రోగమొచ్చినా నంద్యాల, కర్నూలు, జమ్మలమడుగు, తదితర పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఉన్న ఊరిలోనే మెరుగైన వైద్య సేవలందించేలా అన్ని వసతులు కల్పించారు. కోవెలకుంట్లలో రూ. 3.80 కోట్లతో 30 పడకల ఆసుపత్రిని నూతనంగా నిర్మించారు. ఆసుపత్రి ద్వారా రోగులకు అన్ని రకాల వైద్యసేవలందుతున్నాయి. – కృష్ణారెడ్డి, కోవెలకుంట్ల

న్యూస్‌రీల్

30 పోలీస్ యాక్ట్ అమలు

బొమ్మలసత్రం: నంద్యాల సబ్ డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నట్లు డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణంతో పాటు, మహానంది, గోస్పాడు, బండిఆత్మకూరు, గడివేముల, పాణ్యం పోలీసుస్టేషన్ పరిధిలో ఈయాక్ట్ వర్తిస్తుందని వివరించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఉత్సవాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాల్సి వస్తే తప్పనిసరిగా పోలీసుల అనుమతి అవసరమని పేర్కొన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా పై కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లాలో ప్రశాతంగా ముగిశాయి. గురువారం మొదటి సంవత్సరం, శుక్రవారం రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి 52 పరీక్ష కేంద్రాల్లో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలను పకడ్బందీ ఏర్పాట్ల మధ్య నిర్వహించినట్లు డీవీఈఓ సునీత తెలిపారు. ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాంతీయ కార్యాలయ అధికారులు పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టారు. రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ముగియడంతో కేకలు, ఈలలు వేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. చివరి రోజు జరిగిన పరీక్షకు 11,189 మంది విద్యార్థులకు గాను 10,235 మంది హాజరు కాగా 953 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 700కు గాను 599 మంది హాజరు కాగా 101 మంది గైర్హాజరైనట్లు డీవీఈఓ తెలిపారు. పరీక్షల ఉన్నతాధికారులు, సిట్టింగ్ స్క్వాడ్‌ల పర్యవేక్షణలో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించామని వివరించారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ తుది జాబితా

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో సాగైన పంటలకు సంబంధించి ఈ-క్రాప్ తుది జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో 3.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, వంద శాతం ఈ – క్రాప్ నమోదు పూర్తి చేశామన్నారు. 99 శాతం ఈ కేవైసీ ప్రక్రియ సైతం పూర్తయిందన్నారు. ముసాయిదా జాబితాను ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించామన్నారు. ఆర్‌బీకే స్థాయి గ్రామసభల్లో రైతుల నుంచి లిఖితపూర్వకంగా వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, కొన్ని మార్పులు చేర్పులతో తుది జాబితాను తయారు చేశామన్నారు. ఈ క్రాప్‌లో నమోదైన పంట వివరాల రసీదులను ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి రైతులు పొందవచ్చని పేర్కొన్నారు. తుది జాబితా వివరాలను రైతులకు ఎస్ఎంఎస్ రూపంలోనూ పంపిస్తున్నామన్నారు.

భానుడు భగభగ

- 42 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రతలు



కర్నూలు(అగ్రికల్చర్): భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. శుక్రవారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరువయ్యాయి. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 41.90 డిగ్రీలు, నంద్యాల జిల్లాలో అత్యధికంగా 41.93 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలు దాటినా ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మార్చి మొదటి పక్షంలోనే ఎండలతో పాటు వడగాలులు తీవ్రత పెరగడం గమనార్హం. రాత్రి ఉష్ణోగ్రతలు 26 నుంచి 27 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. అక్కడక్కడా ఆకాశం మేఘావృతం అవుతోంది.

ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)
మంత్రాలయం	41.90
గూడూరు	41.29
కోసిగి	41.20
కోడుమూరు	40.95
ఆదోని	40.90
అవుకు	41.93
నందికొట్కూరు	41.56
మహానంది	41.2
బండి ఆత్మకూరు	41.09
ప్యాపిలి	40.7

టీడీపీ ప్రచారంలో రౌడీషీటర్

డోన్: ఎన్నికల ప్రచారంలో నిర్వహించే సభల్లో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అన్యాయాన్ని ఎదుర్కొందాం.. అంటూ ప్రసంగాలతో ఊదరగొట్టే టీడీపీ నేతల తీరు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా కనిపిస్తోంది. కబ్జాదారులు, రౌడీషీటర్లు, మహిళలను వంచించిన కేటుగాళ్లను పక్కన పెట్టుకుని టీడీపీ అభ్యర్థి ప్రచారం నిర్వహిస్తుండటంతో ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుగా పెట్టుకొని మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న కోట్ల హరి సర్వోత్తమరెడ్డి నగర్‌లో పేదల ఇళ్లపట్టాలను ఆక్రమించి ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకున్న ఘనులు, అమాయకులపై అకారణంగా దాడులు చేసిన రౌడీషీటర్లు టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటుండటాన్ని చూసి ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. డోన్ పట్టణ పోలీసుస్టేషన్‌లో రౌడీ షీటర్ నంబర్ 594 కింద పేరు నమోదైన వల్లగాని చక్రపాణిగౌడ్ టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇతనిపై పట్టణ పోలీసుస్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద ఏడు కేసులు నమోదయ్యాయి. ప్రతి ఆదివారం స్టేషన్‌కు వచ్చి సంతకం చేసి వెళ్లాల్సిందే. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాల్లో వైఎస్ఆర్‌సీపీ ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్లను అడ్డుకోవడమే కాక, ట్యాంకర్ డ్రైవర్‌పై అకారణంగా దాడిచేసిన సంఘటనలోనూ ఇతను నిందితుడిగా ఉన్నాడు. ఇలాంటి వ్యక్తులను ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు తిప్పుకోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు, ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు సైతం చర్చించుకుంటున్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రౌడీషీటర్ చక్రపాణిగౌడ్ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)



టీడీపీ హయాంలో ట్రాక్టర్ డ్రైవర్‌ను చితకబాదుతున్న రౌడీషీటర్

అధికారుల సహకారం మరువలేనిది

- కరోనా కష్టకాలాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నాం
- డోన్ అభివృద్ధిలో ఉద్యోగులు కీలక పాత్ర
- అధికారులు, ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో ఆర్థిక మంత్రి బుగ్గన

డోన్: ఐదేళ్లలో డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అధికార యంత్రాంగం చేసి కృషి మరువలేనిదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఉన్నతాధికారుల ఆత్మీయ సమావేశానికి మంత్రితో పాటు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన అధికారులను మంత్రి బుగ్గన అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన మొదటి రెండున్నర ఏళ్లలో ప్రభుత్వం భారీ ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొందన్నారు. కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలో పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు పడిపోకుండా ఉండేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ఎంతో ఊతమిచ్చాయన్నారు. మిగిలిన రెండున్నరేళ్లలో ఎన్నికల ముందు సీఎం ఇచ్చిన హామీలకు అనుగుణంగా నిధులు విడుదల చేశామన్నారు. నిధులు ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేయడంలో అధికార యంత్రాంగం ఎంతగానో సహకరించిందని మంత్రి బుగ్గన కొనియాడారు.



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

కుటుంబ సభ్యులతో గడిపింది తక్కువే..

ఒకవైపు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక మంత్రిగా అప్పగించిన బాధ్యత, మరోవైపు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే తపనతో ఎక్కువ కాలం కుటుంబంతో గడపలేకపోయానని మంత్రి బుగ్గన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లారితే ఏ సమస్యపై ఏ ప్రాంతం వెళ్లాల్సి వస్తుందోనన్న విషయం అప్పటి వరకు తనకు తెలిసేది కాదన్నారు. రూ.3,500 కోట్లతో నియోజకవర్గాన్ని విద్య, వైద్య రంగాలతో పాటు వ్యవసాయం రంగానికి చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. డోన్ నియోజకవర్గాన్ని ఢిల్లీ స్థాయిలో గుర్తిస్తున్నారంటే ఇక్కడి ప్రజలు తనకు ఇచ్చిన అవకాశమేనని మంత్రి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో ఆర్డీఓ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పీఏలు ప్రతాప్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రమేష్ రెడ్డి, అగ్రికల్చర్ ఏడి అశోక్‌వర్ధన్‌రెడ్డి, ఆనిమల్ అబ్జెండల్ ఏడీ డాక్టర్ నాగరాజు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లతో పాటు వివిధ రంగాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కసరత్తు
- ముందస్తు ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం
- ఇప్పటికే బదిలీలు పూర్తి చేసిన యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన

నంద్యాల: సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టింది. రెండు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు ప్రతి అంశాన్ని స్వయంగా పరిశీలిస్తూ పారదర్శక ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. మూడేళ్లు పూర్తి చేసుకున్న అధికారులతో పాటు గత ఎన్నికల్లో భాగస్వాములైన అధికారులను బదిలీ చేశారు. అలాగే ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి సహకారం కోరుతున్నారు. నూతన ఓటరు నమోదు నుంచి తుది జాబితా మార్పులు, చేర్పుల దాకా అన్నీ పార్టీల నాయకులకు విశదీకరిస్తున్నారు. అలాగే అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు. జిల్లాలోని ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాల, పాణ్యం, నందికొట్కూరు, శ్రీశైలం, డోన్ నియోజకవర్గాల్లో 13,72,091 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 6,73,425 మంది ఉండగా మహిళా ఓటర్లు 6,98,404 మంది, ఇతరులు 262 మంది ఉన్నారు. జిల్లాలో 1,706 పోలింగ్ కేంద్రాలు గుర్తించగా 10,236 మంది పోలింగ్ అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 173 రూట్లను ఏర్పాటు చేయనున్నారు. ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి నంద్యాల పార్లమెంట్‌కు 2,030 కంట్రోల్ యూనిట్లు, 2,509 బ్యాలెట్ యూనిట్లు, 2,452 వీవీ ప్యాట్లు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 1,924 కంట్రోల్ యూనిట్లు, 2,520 బ్యాలెట్ యూనిట్లు, 2,451 వీవీ ప్యాట్లను ఏర్పాటు చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, సెగ్మెంట్ల వారీగా కేటాయించే ఈవీఎంల ర్యాండమైజేషన్ డ్రై రన్‌పై ఎన్నికల సిబ్బందికి మొదటి విడత శిక్షణ పూర్తయింది. రిటర్నింగ్ అధికారి స్థాయిలో రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించి అనంతరం పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు కేటాయించనున్నారు.



ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు(ఫైల్)



పోలూరు పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

వసతుల కల్పనకు చర్యలు..

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా వసతులు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే బీఎల్‌ఓలు, మండల స్థాయి అధికారులతో సర్వే చేయించి నివేదికలు తీసుకున్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు తదితర వసతులపై దృష్టి సారించారు. అదే విధంగా ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, శాంతిరాం, ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజీలు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ అంగీకరిస్తే ఈ కాలేజీలలో ఒక దానిని ఎంచుకుంటామని, అభ్యంతరాలు పెడితే గతంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేశారు.

పోలింగ్ శాతం పెంపునకు చర్యలు..

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 2024 సవరణ ఓటరు జాబితాను పడక్బందీగా రూపొందించారు. 2023 జూలై 21 నుంచి 2024 జనవరి 22వ తేదీ వరకు స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)–2024 కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి వివరాలు సేకరించి, ఫారం–6, 7, 8లను స్వీకరించారు. 2024 ముసాయిదా జాబితా ప్రకారం 13,57,998 మంది ఓటర్లు ఉండగా తుది ఓటరు జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 13,72,091గా నమోదైంది. గతంలో విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ జాబితా కంటే 14,093 మంది ఓటర్లు పెరిగారు. ఓటర్ల జాబితాలో సవరణలు, తొలగింపులు, చేర్పులను క్షేత్రస్థాయిలో డాక్యుమెంటేషన్ స్థాయిలో పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్, డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్ కూడా సరి చేశారు. 10 మంది ఓటర్ల కన్నా ఎక్కువగా ఉన్న కుటుంబాలను క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన చేయించి ఓటరు జాబితాలో సరి చేశారు. కొత్తగా మార్పులు జరిగిన ఓటర్లకు సంబంధించి ఎపిక్ కార్డులను కూడా సిద్ధం చేశారు. ప్రజల్లో ఓటు వినియోగంపై చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేపడుతున్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, యువ, క్రియాశీల ఓటర్లతో వాక్ టు పోలింగ్ బూత్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం

రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. పోలింగ్ విధుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఓటరు జాబితా తయారు చేశాం. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల అయినా జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ శ్రీనివాసులు, కలెక్టర్, నంద్యాల

క్లుప్తంగా

18 నుంచి ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఏపీ సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్) స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. హాల్‌టికెట్లను https:// apopenschool. ap. gov. in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ఓపెన్ స్కూల్, కాలేజీ హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ సంతకం చేయించుకోవాలన్నారు.

స్థిరంగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో ఎండుమిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం సూపర్-10, రకం సరకు జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.15,000, మధ్యస్థ ధర రూ.13,800, కనిష్ట ధర రూ. 12,500గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.6,800, మధ్యస్థ ధర రూ.6,300, కనిష్ట ధర రూ.6,000గా నమోదైనట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

22వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోళ్లు



పేర్లు నమోదు చేసుకున్న నోటీసు బోర్డును రైతులకు చూపుతున్న మోహన్‌రావు

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో 22 వేల మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోళ్లు జరిగాయని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. రబీలో పంట నమోదు చేసుకున్న రైతులందరూ స్థానిక ఆర్‌బీకేలో పంట నమోదు రసీదులు తీసుకోవాలని సూచించారు. నంద్యాల మండలం పుసులూరు గ్రామ ఆర్‌బీకే కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి పంట నమోదు చేసుకున్న రైతులకు రసీదులు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ మహీంద్ర రకానికి చెందిన జొన్న క్వింటా రూ.3,180తో కొనుగోలు చేశామని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా జొన్న దిగుబడులను కొనుగోలు చేస్తున్నామని, ఇంకా కొనుగోలు చేసుకోని రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఓ ప్రసాదరావు, ఆర్‌బీకే సిబ్బందిపాల్గొన్నారు.

టీడీపీలో చేరిన బైరెడ్డి శబరి

సాక్షి, నంద్యాల: భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షురాలు బైరెడ్డి శబరి తెలుగుదేశం పార్టీలో చేరా రు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో శుక్రవారం ఆమెకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నంద్యాల ఎంపీ టికెట్ శబరికి ఖరారు అయినట్లు సమాచారం. ఇన్ని రోజులు తనకే టికెట్ ఇస్తున్నట్లు టీడీపీ నంద్యాల పార్లమెంటరీ అధ్యక్షుడు మాండ్ర శివానంద రెడ్డి చెప్పుకుంటు వచ్చారు. శబరి రాకతో మాండ్రను తప్పించినట్లు తెలుస్తోంది. ఐదేళ్లు పార్టీ కోసం భారీగా డబ్బులు ఖర్చు పెట్టించి టికెట్ ఇవ్వక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే శబరి వెంట ఆమె తండ్రి బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఉన్నా టీడీపీ కండువా కప్పుకోకపోవడం గమనార్హం.

- బనగానపల్లె పర్యటనలో సీఎం జగన్‌ను కలసిన అభాగ్యులు
- ఆపదలో ఉన్నామని ఆదుకోవాలని విన్నపం
- పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 16.30 లక్షల ఆర్థికసాయం

మా మంచి సీఎం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి తన మంచి మనసును చాటుకున్నారు. వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధులు విడుదల చేయడానికి గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న నిరుపేదలు కలిసి తమ కష్టాలను చెప్పుకున్నారు. ఆపదలో ఉన్నామని.. ఆదుకోవాలని విజ్ఞప్తి చేసిన వెంటనే మానవతా దృక్పథంతో వారికి ఆర్థిక సాయం అందజేయాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులును సీఎం ఆదేశించారు. దీంతో వెంటనే కలెక్టర్ బాధితుల వివరాలు తెలుసుకుని 16 మందికి రూ.16.30 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందజేశారు.

– సాక్షి, నంద్యాల



బనగానపల్లెలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి తన సమస్యను విన్నవిస్తున్న అవుకు మండలం సంగపట్నానికి చెందిన షేక్ షరీఫ్



సీఎం ఆదేశాల మేరకు షేక్ షరీఫ్‌కు ఫిజియో థెరపీ చికిత్స నిమిత్తం రూ. 2 లక్షల చెక్కు అందజేస్తున్న నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

సీఎం రిలీఫ్ ఫండ్ పొందిన వారి వివరాలు

- నంద్యాల పట్టణం గాంధీనగర్‌కు చెందిన లక్కా కేశవ పక్షవాతంతో బాధపడుతుండడంతో చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష అందజేశారు.
- నంద్యాల పట్టణం గాంధీనగర్‌కు చెందిన కె.మార్తమ్మ మూర్ఛ వ్యాధితో బాధపడుతుండడంతో చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- అవుకు మండలం సంగపట్నానికి చెందిన షేక్ షరీఫ్ ఫిజియో థెరపీ చికిత్స కోసం రూ. 2 లక్షల చెక్కును కలెక్టర్ అందజేశారు.
- అవుకు మండలం గుండ్ల సింగవరానికి చెందిన ఎస్.గణేష్ బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో చికిత్స కోసం రూ.లక్ష అందజేశారు.
- అవుకు మండలం సింగనపల్లెకు చెందిన ఎ.తారకేశవ్ మాన సిక వికలత్వంతో బాధపడుతుండడంతో చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- అవుకు మండలం గుండ్ల సింగవరానికి చెందిన కాటసాని గణేష్ బ్రెయిన్‌లో నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. బాధితుని చికిత్స కోసం రూ. 50 వేల చెక్కును కలెక్టర్ అందజేశారు.
- బనగానపల్లె మండలం గుండ్ల సింగవరం గ్రామానికి చెందిన కంబగిరి స్వామి మెదడులో నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. అతని చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం ఒద్దిరాళ్ల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. అతనికి చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- అనంతపురం పాతబస్తీకి చెందిన పి.ముష్కస్ బ్యాక్ బోన్ ఫ్యాక్చర్‌తో బాధపడుతోంది. ఆమెకు చికిత్స కోసం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- రోడ్డు ప్రమాదంలో మోకాలు పోగొట్టుకున్న అనంతపురానికి చెందిన బాధితుడు ఎస్.ఖాజాకు రూ.50 వేల చెక్కును అందజేశారు.
- ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామానికి చెందిన సి.సోమశేఖర్ పేదరికం కారణంగా గృహ నిర్మాణం నిమిత్తం రూ.లక్ష చెక్కును అందజేశారు.
- ప్రకాశం జిల్లా ఓబులంపల్లికి చెందిన బాల గురువయ్య వైద్య ఖర్చుల కోసం అతని భార్యకు రూ.లక్ష చెక్ అందజేశారు.

కిడ్నీ బాధితుడికి..

బనగానపల్లె మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ వజీద్ తన కుమారుడు కిడ్నీ సమస్యతో 18 నెలలుగా బాధపడుతున్నాడని నెలకు రూ.5 వేలు వైద్యానికే ఖర్చవుతోందని సీఎం జగన్‌తో చెప్పారు. స్పందించిన సీఎం చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసాయం అందివ్వాలని కలెక్టర్‌కు సూచించడంతో వెంటనే రూ.లక్ష చెక్‌ను అందజేశారు.

చిన్నారికి సాయంగా..

అవుకు మండలం వేములపాడు గ్రామానికి చెందిన బి.మనురాహుల్(6) వికలత్వంతో బాధపడుతున్నానని, వ్యాధి చికిత్సకు ఆర్థిక సాయం చేయాలని ముఖ్యమంత్రి జగన్‌నుతల్లిదండ్రులు కలిసి అభ్యర్థించారు. సీఎం ఆదేశంతో రూ.లక్ష చెక్కును కలెక్టర్ అందజేశారు.

దివ్యాంగుడికి ఆసరాగా..

బనగానపల్లె పట్టణానికి చెందిన దివ్యాంగుడు అబ్దుల్ హజీమ్(22) తాను వికలత్వంతో బాధపడుతున్నానని ఆర్థికసాయం చేయాలని సీఎం జగన్‌కు అభ్యర్థించారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ శ్రీనివాసులు హజీమ్‌కు రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

నిరుపేదకు అండగా..

గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన హరిజన గోరంట్ల దివ్యాంగుడు. పేదరికంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. తన పరిస్థితిని బనగానపల్లె సభలో సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో పై చదువులకు రూ.15 వేలు, జీవనోపాధి కోసం మరో రూ.15 వేలను కలెక్టర్, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి మొత్తం రూ.30 వేల చెక్కును అందజేశారు.

అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేకాలంకరణలో విష్వక్సేనుడు



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి వైభవంగా అంకుర్పారణ చేశారు. అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎగువ అహోబిలంలోని శ్రీ జ్వాలా నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనుడికి పూలమాలలు వేసి, తల పాగా చుట్టి పల్లకీలో కొలువుంచి ఆలయం వెలుపలకు తోడ్కొని వచ్చారు. ఈ బ్రహ్మోత్సవాలకు పర్యవేక్షకుడిగా విష్వక్సేనుడు వ్యవహరిస్తారని విశ్వాసం. అనంతరం ఆలయానికి ఈశాన్యం వైపు ఉన్న పుట్టకు పూజలు నిర్వహించి పుట్ట మన్నును సేకరించి మండపం దగ్గరకు తీసుకువచ్చారు. అక్కడ అంకుర హోమం నిర్వహించి సోముడిని (చంద్రుడిని) మట్టిలోకి ఆవాహం చేశారు. పాత్రలో మట్టిలో నవగ్రహాలకు సూచికగా నవధాన్యాలను పోసి సోమకుంభ స్థాపన చేశారు.

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఎగువ అహోబిలంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం భేరీపూజ కొనసాగుతుంది. మధ్యాహ్నం అభిషేకం, రాత్రి స్వామి వారు సింహ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమివ్వనున్నారు. దిగువ అహోబిలంలో అంకురార్పణ కార్యక్రమం ఉంటుంది

నేడు దిగువ అహోబిలంలో..

దిగువ అహోబలంలో బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో అంకుర్పారణ పూజలు నిర్వహిస్తారు.

ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

కర్నూలు (టౌన్): కర్నూలు, నంద్యాల జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, రఘువీర్ రెడ్డి ఇచ్చిన నివేదికల ఆధారంగా విధులను నిర్లక్ష్యం చేసిన ముగ్గు రు పోలీసులను సస్పెండ్ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. తన భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఒక మహిళ అవుకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించకపోవడంతో ఆమె హత్యకు గురైంది. ఈ ఘటనకు సంబంధించి అవు కు పోలీసు స్టేషన్ ఏఎస్ఐ వి.ఎల్. సుబ్రమణ్యం,కానిస్టేబుల్ నంద నాయక్‌లను సస్పెండ్ చేశా రు. అలాగే కర్నూలు త్రీటౌన్ పోలీసు ఏఎస్ఐ తిరుపాల్ నాయక్ , అతని కుటుంబ సభ్యులు ఏడు నెలల గర్భవతి అయిన తమ కోడలిని అదనపు కట్నం తీసుకురావాలని మానసికంగా వేధించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో తిరుపాల్ నాయక్‌ను సస్పెండ్ చేశారు.

ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్‌రెడ్డి

సాక్షి, నంద్యాల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ విభా గం ప్రధాన కార్యదర్శిగా కె.అనిల్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

గ్రూప్- 1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాజరుకానున్న 3,675 మంది అభ్యర్థులు
- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్రూప్- 1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 17వ తేదీన నిర్వహించే ఏపీపీఎస్సీ, గ్రూప్-1 పరీక్షలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో జేసీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ పద్మజ, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ, గ్రూప్ - 1 సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్)లో నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలను 17వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్షలు రెండు సెషన్‌లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రూప్ – 1 పరీక్షల కోసం జిల్లాలో 7 రెవెన్యూ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 3,675 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు.పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతి లేదన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

– జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: భారత ఎన్నికల సంఘం సూచించిన నియమావళిని అనుసరించి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఎన్నికలనిర్వహణపై సెక్టోరల్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు సూపర్‌వైజర్లు, పోలీస్ సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్లలో ఎక్కడైనా లోపాలు ఉంటే సరి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటులో ఎలాంటి లోపాలు ఉండరాదన్నారు. బూత్ స్థాయి పరిధిలోని ఓటర్లకు ఓటింగ్ విధానంపై ప్రభావితులను చేసేందుకు బూత్ స్థాయి అవగాహన గ్రూపులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు ఓటర్ స్లిప్‌లను ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సెక్టోరల్ అధికారులను సమన్వయం చేసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఆర్ఓ, తహసీల్దార్ చబద్రశేఖర్ రెడ్డి, నంద్యాల ఆర్వో పరిధిలోని మండలాల అధికారులు, ఎఫ్ఎస్టీ ఎంసీసీ, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి రూ. కోటి మంజూరు



భూమిపూజ చేస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ మహేశ్వరరెడ్డి

మహానంది: మహానంది దేవస్థానం దత్తత దేవాలయమైన తమ్మడపల్లెలోని శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులకు రూ. కోటి మంజూరైనట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మహానంది ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. వేదపండితులు రవి శంకర అవధాని, ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మలు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మహానంది ఆలయానికి దత్తత దేవాలయమైన కాశీ విశ్వేశ్వర ఆలయం ఎంతో ప్రాచీనమైందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ కొమ్మా ప్రతాప్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని..



మృతిచెందిన షకీర్ బాషా

మిడుతూరు: సుంకేసుల గ్రామానికి చెందిన ఓ యువకుడు భార్య కాపురానికి రాలేదని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుంకేసుల గ్రామానికి చెందిన షాకీర్ బాషాకు (35) నందికొట్కూరు పట్టణం బైరెడ్డి నగర్‌కు చెందిన మాబున్నీతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా షకీర్ బాషా మద్యానికి బానిస కావడంతో మద్యం సేవించవద్దని పలుమార్లు చెప్పినా మారలేదు. దీంతో మద్యం మానక పోవడంతో ఈనెల 9వ తేదీన మాబున్నీ పుట్టింటికి వెళ్లింది. ఇక భార్య రాదని మనస్తాపం చెందిన యువకుడు శుక్రవారం ఉదయం ఇంటిలో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గుర్తించి కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి శాలిమియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పి స్తూ పీఆర్అండ్ఆర్‌డీ కమిషనరేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన వారికి పదోన్నతి కల్పించడంతో పాటు ఇతర జిల్లాలకు పోస్టింగ్ ఇచ్చారన్నారు. నంద్యాల జిల్లాకు సంబంధించి కె.సరళమ్మ, సి.హరిప్రసాద్, ఈ.శివకుమార్ గౌడ్, జి.ప్రకాశం, వి.అశ్విన్‌కుమార్‌కు పదోన్నతి లభించిందన్నారు. రెండు జిల్లాలకు సంబంధించి పలువురికి సొంత జిల్లాలోనే, మిగిలిన వారికి అన్నమయ్య జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారన్నారు.



పరీక్షలు అయిపోయాయోచ్..



టాటా..బాయ్‌బాయ్..వీడ్కోలు చెబుతూ..

హాయిరే హాయ్.. జాయ్‌రే జాయ్!

ఇంత వరకు వారు పుస్తకాలతో కుస్తీ పట్టారు. టీవీలకు, సెలఫోన్లకు దూరంగా ఉంటూ రేయింబవళ్లు కష్టపడి చదివారు. ఇంటర్ పరీక్షలను శ్రద్ధగా రాశారు. శుక్రవారం పూర్తి కావడంతో ఆనందంగా చిందులు వేశారు. తోటి మిత్రులతో సంతోషాన్ని పంచుకున్నారు. కాలేజీలకు, హాస్టళ్లకు వీడ్కోలు చెబుతూ సొంత ఊర్లలో హాయిగా గడిపేందుకు పయనమయ్యారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



టెన్షన్ తగ్గింది.. ఐస్‌క్రీమ్ తిందాం



హాస్టళ్ల నుంచి ఇళ్లకు బయలుదేరుతూ..



విద్యార్థులతో కిక్కిరిసిన కర్నూలు ఆర్టీసీ బస్టాండ్



బస్సులో సీట్ల కోసం పాట్లు..